# నెమళ్ల అడవి

చెరకుతోటల మధ్యనించి "మేష్టరుగారండీ" అని పిలుపు.

కీ... కీ... కీ... అని పలుకుతూ తననే పిలుస్తున్నట్టుగా ఓ అడవిపిట్ట తలమీంచి ఎగిరిపోయింది.

ఆ పిలిచింది సత్యమే. వెతుకుతున్న నా చూపులకు పొడుగ్గా పెరిగిన చెరకుతోటలు ఆకుపచ్చ అందాలతో సాయంకాలపు గాలుల్లో తలలూపుతూ కనిపిస్తున్నాయే తప్ప, సత్యం జాడ మాత్రం లేదు. చుట్టూ చూస్తే ఓవేపు మామిడితోటలు. అవి దాటితే కెరటాల్లా, వరసలు వరసలుగా దూరమవుతున్న కొద్దీ నీలం మెరపెక్కుతున్న కొండలు.

కొంతసేపటికి నవ్వుముఖంతో, చేతిలో కొడవలితో, రెండు చెరకు పొలాలమధ్య గట్టుమీంచి బైటపడ్డాడు — ఆరడుగుల రైతుబిడ్డ సత్యం.

సవరఊళ్లు చూడాలని పడమరగా ఉన్న కొండల వేపు వెళ్లి, ఒంటరిని కావటంవల్ల, రోడ్డుదిగి కాలిదారిన లోతట్టున ఉండే సవరఊళ్లల్లోకి, మీదపడి కరిచేకుక్కలభయంతో వెళ్లలేక తిరిగి వచ్చేస్తున్న నాకు సత్యం కనిపించటంతో అడవిని గెలిచినంత ధైర్యం చిక్కింది.

సత్యాన్ని చూస్తే నెమళ్లఅడవి గుర్తొస్తుంది నాకు. నన్ను చూస్తే సత్యానికి జాబిల్లిపేట గుర్తొస్తుంది. మళ్లీ ఇప్పుడు అడుగుతాడు 'ఎప్పుడెల్తారండీ' అని. ప్రయాణంవాయిదా వేసుకోవటానికి నాకున్న ఇబ్బందులతో సత్యానికి పనిలేదు.

"సత్యం నీ గడ్డిమోపు తయారయినట్టుంది కదా. నెమళ్ల అడవికి ఇవేళ వెళ్లాలి మనం. చాలా పొద్దుంది" అన్నాను. పడమటి ఆకాశంలో కొండల మీది పొద్దును

చూసి.

సత్యం లేకుండా ఆ కొండ అడవుల్లో అడుగుపెట్టడం ప్రమాదం. ముందు ఆ అడవిదార్లు తెలీవు నాకు. వెళ్లిన ప్రతిసారి కొత్తగానే ఉంటాయా దార్లు. ఆ అడవుల్లో సింహాలు, పులులు, చిరుతపులులు, చివరికి ఎలుగ్గొడ్డులు సైతం అంతరించి పోయాయి. అయితే, తోడేళ్లూ, దుమ్మల గొండులూ ఉన్నాయి. అవి చాలు నా ప్రాణాలకి.

పడమటికొండల మధ్యనించి వచ్చే మట్టిరోడ్డు ఇక్కడ ఉత్తర దక్షిణాలుగా పోతున్న కంకరరోడ్డును కలుస్తుంది. నెమళ్ల అడవికి మేము పోవాలంటే ఉత్తరంగా దాదాపు ఓ కిలోమీటరు దూరం రోడ్డంబడి నడచి కుడివైపు అడవిలోకి దిగాలి. దార్లో ఒక గెడ్డ, రెండు మూడు గోర్జీలు, వంతర్లు దాటాలి.

పడమటి ఆకాశంలో వాలుతున్న పొద్దువేపు చూసి, 'సరే' అన్నాడు సత్యం. చేతిలోని కొడవలిని తన గడ్డిమోపు ఉన్న గట్టువైపు విసిరేశాడు.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. ఎప్పుడన్నా బస్సు లేదా లారీ తప్ప, ఇతర వాహనాల రాకపోకలు ఆ రోడ్డు మీద చాలా తక్కువ.

అవే చివరి చెరకుతోటలు. అవి దాటితే మెట్ట భూములు. వాటిలో చెదురుమదురుగా మామిడితోటలు. ఆ తోటలు దాటితే ముండ్ల పొదలతో పచ్చటి చిట్టడివి.

బాగా లోపలికి వెళ్తే అడవి చెట్లు మొదలవుతాయి.

మేము వెళ్లాలనుకున్న నెమళ్లు వాటి ఆశ్రయాలకి సరిగ్గా ఆ సమయం లోనే తిరిగి చేరుకుంటాయి. అవి వచ్చే దృశ్యం చూడాలి. కొమ్మ మీంచి కొమ్మకు వాలుతూ, పదడుగులు నేల మీద నడుస్తూ, చెట్టు మీంచి చెట్టుకు ఎగురుతూ, నాలుగు వైపులనుంచీ వస్తాయి. గూళ్లకు చేరుకుంటున్న ఆనందంతో ఆడుకుంటూ ఆడుకుంటూ వచ్చేవాటిని చూడటం అరుదైన భాగ్యం.

ఇట్లా నెమళ్లు ఉన్న అడవి ఒకటి ఈ ఊరుకు ఇంత చేరువలో ఉన్నట్టు ఇక్కడకు వచ్చిన దాదాపు ఏడాదికిగాని నాకు తెలీలేదు. ఆ తెలుసుకోవటం అనుకోకుండా తటస్థించింది. కడుపు నొప్పి, వాంతులు ఒకటి రెండేళ్లుగా నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. అల్లోపతి వైద్యం పని చెయ్యలేదు. నా బాధ చూసి సవరఊళ్లో ఒక ముసలాయన ఆకుపసరు మందు ఇస్తాడని సత్యం నన్ను ఆ సవరఊరు తీసుకుపోయాడు. మందు తీసుకుని మేము వెనక్కి వస్తుంటే దారి కడ్డంగా చెట్ల

తుప్పల్లో ఆడనెమలి పిట్ట కనిపించింది.

"సత్యం! నెమలేనా?"

కొత్తలోకంలో పొరపాటున అడుగుపెట్టినట్టు నా కండ్లను నేనే నమ్మలేక పోయాను.

"నెమలి! నెమలే!"

అక్కణ్ణించి కదల్లేకపోయాను.

"ఇక్కడ నెమళ్లు ఉంటాయని ఊళ్లో ఎవరూ చెప్పరేం?"

నా ఉద్దేశం ఏమిటంటే ఆ ఊరు వచ్చే కొత్తవాళ్ళకు అదో వార్త కావలసింది. అదో పెద్ద వినోద పర్యాటకమైన ఆకర్షణ కావలసింది. ఆ నెమళ్ల అడవిని చూట్టానికి జనం కార్లల్లో, బస్సుల్లో మున్నూటరవైరోజులు తండోప తండాలుగా రావలసింది. ఆ ఊరు ఒక పర్యాటకకేంద్రం కావలసింది. పర్యావరణ విద్యావిషయాలను ప్రచారంచేసే బృందాలు అక్కడ తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సింది. అందాలదీవిగా ఆ అడవికి కనీసం రాష్ట్రస్థాయిలోనన్నా కీర్తిప్రశంసలు రావాల్సింది. పర్యాటకుల కోసం ఇక్కడ ఎన్నో సదుపాయాలు, విశ్రాంతిభవనాలు, హోటళ్లు, కార్లు, గుర్రపు బళ్లు, సహాయకులు, ఫోటోస్టూడియోలు, ఫోటోగ్రాఫర్‌లు, వర్తకులు, పుస్తకాల షాపులు, పక్షుల చరిత్రలతో, వర్ణచిత్రాలతో పుస్తకాలు పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దుకోగల సంపన్న సహజ వనరులన్నీ ఉన్న ఊరది.

ప్రకృతిరమణీయమైన ఇంత అపురూపమైన అందాన్ని సైతం పట్టించుకోని ఆ జనం అంధత్వం పట్ల ఆగ్రహం, అసహనం సహజంగానే కల్లోలపరచాయి నన్ను.

'సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నీలం ఆకాశం, రంగు రంగుల మేఘాలు, వర్షాలు, ఉదయాస్తమయాలు, కొండ శిఖరాలు, నదీప్రవాహాలు అన్నీ మామూలే. కొత్త విచిత్రం అందులో ఏముంది? అడవుల్లో నెమళ్లు ఉండక కోళ్లుంటాయా' అన్నట్టు తిక్కమనిషిని చూసినట్టు నావైపు చిత్రంగా చూశాడు సత్యం.

పదేళ్ల కిందటి వరకు అక్కడ నెమళ్లను వేటాడేవాళ్లట ఆ ఊరిదొరలు. నెమలిని జాతీయవిహంగంగా ప్రభుత్వం ప్రకటించిన తర్వాత అటవీ అధికారులు కట్టుబాట్లు చేసి, కొంతమందిని కఠినంగా శిక్షించి, జుల్మానాలు విధించి భయపెట్టటంతో నెమళ్ల వేట అక్కడ తగ్గిందట. అయిదారేళ్ల కిందట కొత్తగా ఉద్యోగంలో చేరిన కుర్ర అటవీ అధికారి ఆ చుట్టుపక్కల గ్రామాలలో కాలినడకన తిరిగి, గ్రామపెద్దలతో మాట్లాడి, నెమళ్లను కాపాడి పెంచే బాధ్యతను వాళ్లకే అప్పజెప్పటంతో ఇప్పుడు నెమళ్లజోలికి

ఎవరూ పోవటం లేదట. దాంతో ఈ అడవిలో నెమళ్లు మరో రెండుమూడు చోట్ల ఇప్పుడు కనిపిస్తున్నాయట.

రోడ్డు దిగి, గెడ్డదాటి, గట్టెక్కి, రేగుచెట్ల మధ్యనించి, చీపురుతుప్పలను దాటుకుంటూ, పరిగముళ్లకంపలను తప్పించుకుంటూ అడ్డదారిన సత్యం తీసుకుపోతున్నాడు. పాదాలకు చెప్పులు లేకున్నా సత్యం వెతుక్కోకుండా నడుస్తున్నాడు. చెప్పులున్నా ముళ్లు గుచ్చుకుంటున్నాయి నాకు.

"జాబిల్లి పేట ఎప్పుడెల్తారు మేష్టరుగారండీ?"

దాదాపు మూడు మాసాలుగా సత్యం అడుగుతున్నాడు ఇదే ప్రశ్నని.

సత్యం అత్తగారి ఊరది. ఇక్కడకు నలభై కిలోమీటర్ల దూరం. పెళ్లయిన కొత్తలో పెళ్లాం అత్తగారింటికి వచ్చి, ఒక నెల దినాల పాటు భర్తతో కాపురం చేసి కన్నవారింటికి వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. నాలుగేళ్లయింది కిందటి శివరాత్రికి. అన్న, వదిన వెళ్లి ఆమెను పిలిచారు పంపించమని. రాలేదు. చిన్నమ్మ, చిన్నాయనవెళ్లి పిలుపుచేశారు. పంపించలేదు. ఊరిపెద్దలు కలగజేసుకున్నారు. అయినా ఫలితం లేదు. ఇప్పుడు సత్యం నా నుంచి కోరుతున్న సహాయం — ఆ ఊరెళ్లి అక్కడ వాళ్ల అత్తతో, పెళ్లాంతో మాట్లాడి, వాళ్లకు నచ్చజెప్పి, ఆ పిల్లను కాపరానికి పంపించేట్టు చూడమని. నేను నచ్చజెప్తే పెళ్లాం ముత్యాలు వినుకుంటుందని సత్యానికి నా మీద నమ్మకం.

ఆ ఊళ్లో నా తొలి స్నేహితుడు సత్యం. దాదాపు ఏడాదిన్నర కిందట ఓ వర్షపు ఉదయాన, నా తొలి ఉద్యోగంలో చేరటానికి కొండల మధ్య ఈ ఊళ్లో అడుగు పెట్టినప్పుడు, బస్ దిగిన చోట పండా టీకొట్టు ముందు సత్యమే నా సూట్‌కేస్ అందుకుని ఆ ముసురు వానలో ప్రధానోపాధ్యాయులు గోదావరిరాజుగారింటికి నన్ను తీసుకుని వెళ్లింది. బస్టాండ్‌కీ, ఆ ఊళ్లో ఆ ఏడాదే కొత్తగా పెట్టిన ఉన్నత పాఠశాలకీ మధ్య ఓ కిలోమీటరు దూరం ఉంటుంది. చెరువుగట్టు మీంచి వెడితే ఊరు. పెద్దదే. ఊరు దాటితే పడమరగా విసిరేసినట్టు అంతదూరంలో ఈ కొత్త బడి.

సత్యాన్ని చిన్నరైతు అనేకంటే రైతుకూలీ అనటం సబబు. ఇద్దరన్న దమ్ములకు ఉమ్మడిగా రెండెకరాల పొలం ఉన్నా ఇంటిపెత్తనమంతా అన్నదే. సత్యం తమ్ముడన్న మాటేగానీ అతణ్ణి అన్న పనివాడిలా చూసేవాడు తప్పించి, తమ్మునిలా చూసేవాడు కాదు. బీడీలకు పైసలు కావాలన్నా అన్నను అడుక్కోవలసిందే తప్ప సొంతానికి సత్యం చేతిలో ఒకరూపాయి కూడా ఉండేది కాదు. ఊళ్లో కూలికి వ్యవసాయపు

పనులు ఏమన్నా చేస్తే ఆ పైసలు అన్న చేతిలో పెట్టాల్సిందే. అన్నకు లెక్కచెప్పాల్సిందే. సత్యం పరిస్థితి చూసినప్పుడు ఆ పేదరికానికి, ప్రేమానురాగాలు లేని అన్నదమ్ముల రక్తసంబంధానికి దిగులు పుట్టేది. ఆ అన్న మాత్రం బాగున్నాడా అంటే వాడూ అంతే. ఊళ్లో టైలర్ కుట్టిన నేతబట్టబనియనూ, పంచెకట్టూ, భుజాన మాసిపోయిన తువ్వాలూ, చినిగిపోయిన బట్టలూ, పెరిగిన గెడ్డమూ మీసాలూ, భుజాల మీదపడే నూనె ఎరగని జుత్తూ. తిండిగడవటం సైతం వాళ్లకు కష్టంగానే ఉంటున్నదనిపిస్తుంది.

జాబిల్లిపేట నాకు కొత్త. తెలిసిన వాళ్లు ఎవరూ ఆ ఊళ్లో లేరు. కులం చొరవ తీసుకుందామంటే మా ఇద్దరిదీ ఒకకులం కాదు. కులపెద్దలు, బంధువులు, కులపంచాయతీలో తేల్చుకోవాల్సిన సమస్య అది. ఆ ముడులు విప్పటం నాకు తెలీదు. అయితే, నామీద సత్యాన్నికి గురి. నేను తలచుకుంటే పని జరిగి తీరుతుందని అతని నమ్మకం. నా చిన్న వయసు, అల్పమైనశరీరం చూసి కుర్రవెధవ అనుకుంటారే తప్ప పెద్దమనిషిగా చూడరు. అదీ జంకు.

సత్యం సమస్యాపరిష్కారం నాకు ఒకంతట కొరుకుడు పడటం లేదు. ఆ జాబిల్లిపేటలో అడుగుపెట్టటానికి సమయం అనుకూలించటం లేదు. నేను వెళ్లి రాయబారం చేసినా ముత్యాలు వస్తుందనుకోను. నాకన్నా కావలసిన పెద్దలే వెళ్లారు, వచ్చిందా? ఆ ఊళ్లో ఉన్నతపాఠశాల ఒకటి ఉంది. ఈ జిల్లాలో మొట్ట మొదటి నాలుగు ఉన్నత పాఠశాలల్లో అది ఒకటి అని పేరుపడ్డది. అక్కడ తోటి ఉపాధ్యాయులను నేను పరిచయం చేసుకోవచ్చు. అట్లా వెళ్లవచ్చులే అనుకుంటే అదే బడిలో పనిచేస్తున్న పంతులుతోనే ఈ ముత్యాలుకు మంచయిందనీ, అందుకే ఆ పిల్లకాపురానికి రావటంలేదనీ ఓ కథ వినబడుతున్నది. దగ్గర్లోనే వెళ్లాలను కుంటున్నాను. ఈ చిక్కువిడుతుందని కాదు. ఆ పిల్లను చూడాలని, ఆమెతో మాట్లాడాలని. ఆ పిల్లమీద అపవాదులు ఎన్ని ఉన్నా నిజం ఏమిటో తెలుసు కోవాలన్న ఆసక్తి నాలో.

ప్రయత్నం ఫలిస్తుందన్న నమ్మకం కలిగితేనే తప్ప ఇలాంటి పనులను నెత్తిన వేసుకోను. అది నా స్వభావం. సత్యం విషయంలో ఏదీ అను కూలించటం లేదు. దాంతో నా ప్రయాణం ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్నది. నా నిస్సహాయ పరిస్థితి అది. సమయం కలిసి రావాలి. దాని కోసం ఎదురుచూడాలి. ఏదీ అనుకూలించనప్పుడు మనకి ఓపిక అవసరం. అదే నేను చేస్తున్న పని. సత్యానికి అది

అర్థం కావటం లేదు. అదే నాబాధ.

"సత్యం, మళ్లా పాత మాటే చెప్తున్నాననుకోకుగాని, మీ కులంలో మారు మనువులున్నాయి కదా! నువ్వు విడాకులిచ్చేస్తే ఆ పిల్ల తనకు నచ్చినవాడిని చేసుకుంటుంది. నీకు నచ్చిన పిల్లను నువ్వు చేసుకోవచ్చు. ఈ ఆలోచనొక్కటే నీ సమస్యకు సర్వసమ్మతమైన పరిష్కారంగా నాకు తోస్తోంది."

సత్యం ఒప్పుకోడు. నాకు తెలుసు. నా సలహా సత్యం పాటిస్తే ఈ వ్యవహారం ఎప్పుడో పరిష్కారమయ్యేది. తలబద్దలు కొట్టుకునే పరిస్థితి నాకు తప్పేది.

ఆ పిల్లకు ఆ ఊళ్లో మేష్టరుతో అక్రమ సంబంధం ఉందనీ, అందువల్లనే కాపురానికి మొగుడి దగ్గరకు రావటం లేదనీ ఊరంతా చెప్పుకుంటున్న విషయమే. అయినా సత్యం ఆ పిల్లనే కావాలనుకోవటం వింతగా ఉంది. ఊళ్లల్లో ఇట్లాంటి వ్యవహారాల్లో విడాకులు తీసుకోవటం మామూలే. నాలుగేళ్లు ఎవరూ ఆగరు. వాళ్ల కులంలో, రెండువైపులపెద్దలు కూర్చుని ఒక మాట అనుకుంటే ఆక్షణంలోనే పరిష్కారమవుతుంది విడాకుల తంతు.

కొండల్లోకి దిగిపోయాడు సూర్యుడు. కొండ నీడలో సగం అడవి మునిగిపోయింది.

నెమళ్లఅడవికి వెళ్లాలని మధ్యలో చాలాసార్లే అడిగాను సత్యాన్ని. కుదరలేదు. నేనొక్కడినీ వెళ్లే అడవి కాదది. నాకు సాయంగా వచ్చి, నా కోరిక మేరకు నెమళ్ల అడవికి తీసుకుని వెళ్లే మరోస్నేహితుడు ఎవరూ ఆ ఊళ్లో నాకు దొరకలేదు. మా ఉపాధ్యాయులకు బడి విడిస్తే ట్యూషన్‌లు. ఒక్కో ఇంట్లో ఒక్కో కొట్టు. కొంతమందికి ఊళ్లో పెద్దలు కొందరితో కలిసి వాళ్లే గౌరవనామంతో పెట్టుకున్న క్లబ్. అక్కడ ఆడేది పైసలు పెట్టి పేకాట, జూదం, సిగరెట్టు పొగ, బూతు జోకులు. ఆ క్లబ్‌లో కనీసం దినపత్రిక కూడా ఉండదు. ఒకరిద్దరు పంతుళ్లు పొరుగూళ్లలో కాపురాలు పెట్టారు. బడిగంట కొట్టిన వెంటనే సైకిలెక్కుతారు వాళ్లు.

నేను ఒంటరినే. ఇవేళ కూడా ఉత్తరాలు రాలేదు. దాంతో నాకు స్నేహితుల మీద కోపం. ఉద్యోగాల కోసమని, చదువుల కోసమని, వ్యాపారాల కోసమని స్నేహితులం పొట్టచేత్తో పట్టుకుని దేశంనలుమూలలా చెదిరి పోవటంతో ఉత్తరాలే దిక్కయ్యాయి. ఢిల్లీలో ఉంటున్న ముద్దుకృష్ణ పండగ రోజుల్లో గ్రీటింగ్స్‌కి పరిమితమై పోయాడు. మా స్నేహితుల్లో అదృష్టవంతుడు వాడే. పద్దెనిమిదో ఏటనే జాతీయ కళాకారుడిగా గౌరవ, సన్మానాలు పొందాడు. ఢిల్లీ అకాశవాణిలో వయోలిన్

కళాకారుడిగా ఉద్యోగం, చలనచిత్ర రంగంలో రెండు కళాత్మక చిత్రాలకు సంగీత దర్శకుడు, ప్రపంచ దేశాలలో సాంస్కృతిక బృందాలతో పర్యటనలు, కచ్చేరీలు, పత్రికల్లో ఇంటర్వ్యూలు, ప్రశంసాత్మక పరిచయ వ్యాసాలు — మూడేళ్లయింది ఇటు రాక. కిందటిసారి ఊరు వెళ్లినప్పుడు వాళ్లమ్మగారు కన్నీరు పెట్టుకున్నారు. పెళ్లి చేసుకోకుండా ఎన్నాళ్లు ఉంటాడని ఆమె బాధ. ఆ సంగతే ఉత్తరం రాసి, వెంటనే జవాబు రాయమంటే, రెండు వారాలవుతున్నది, జవాబు లేదు. కలిస్తే ప్రాణం పెట్టే స్నేహహృదయం. విడిపోతే మరచిపోతాడేమో! హైదరాబాద్‌లో ఇంగ్లీషు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా శిరోమణి, డూన్ స్కూల్‌లో ఇంగ్లీషు మేష్టరుగా రామారావు, ఝాన్సీలో కృష్ణన్నయ్య, శ్రీనగర్‌లో రక్షణశాఖలో గురుమూర్తి, బాంబేలో టెలిఫోన్స్‌లో వెంకటరత్నం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీరమణ, గౌహతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ సుబ్బారావు — అందరూ మరిచిపోయారు. ఉత్తరాలు లేవు. సెలవు రోజు. సాయంత్రం మూడుకే బయటపడ్డాను, కొండల వైపు పోయి రావాలని.

సత్యం లేకపోతే ఆ కొండలు నాకు దుర్భేద్యాలయిపోతాయి. నేను వెళ్లాలనుకున్నప్పుడల్లా సత్యానికి కుదరదు. నెమళ్లఅడవిని రెండోసారి చూడటానికి వెళ్లటం మళ్లీ పడలేదు. ఇవేళ చివరికి ఆ అవకాశం చిక్కింది.

మా పక్క వేపచెట్టు మీద రామచిలుకలు ఆడుకుంటున్నాయి. దాన్ని 'చిలకల చెట్టు' అంటాడు సత్యం. దార్లో అదో కొండగుర్తు మాకు. అది దాటితే మరో పదినిమిషాల నడక. రెండో కొండగుర్తు రాళ్లగుట్ట. అది దాటి మరో పదినిముషాలు నడిస్తే దిగుడు లోయ.

ఒక పాము జర్రున మా ముందునుంచే ఒక పొద నుంచి మరోపొదలోకి జారిపోయింది. సత్యం నన్ను పట్టుకుని ముందుకు అడుగు పడనివ్వలేదు. చప్పుడు చెయ్యొద్దని నోటిమీద వేలు పెట్టాడు. ఇదే సత్యం అవసరం. పక్కన సత్యం ఉంటే అడవి భయం ఉండదు.

రాతిగుట్ట సమీపించాం. పొడుగాటి తాటిచెట్టు ఎత్తున శివలింగం ఆకారంలో నల్లనల్లని పెద్దబండలు. పదిపన్నెండుంటాయేమో. ఒకే చోట, ఒక కుటుంబంలాగ. మళ్లీ ఆ దగ్గర్లో చుట్టుపక్కల ఎక్కడా కొండరాళ్లు కనిపించవు. వాటి దగ్గర్లో వెదురుపొదలు. ఆ రాళ్లు ఎంత అందమైనవో. కళాకారులు, ఛాయాగ్రాహకులు వాటిని చూస్తే అక్కడినించి కదలగలరా అనిపిస్తుంది. సత్యానికి వాటిల్లో కూడా అందం కనిపించదు.

రాళ్లగుట్ట దాటితే దిగుడులోయ. ఆ లోయలోనే నెమళ్లు ఉండేది. అది దాటి ఇంకొంచెం దూరం పోతే పెద్ద అడవికోనేరు. అక్కడ రకరకాల, రంగురంగుల నీటిపక్షులు. అక్కడ సవరలు ఏడాదికోసారి చైత్రమాసంలో అడవిదేవత పండుగ చేసుకుంటారు.

ఒక్కసారా వెలుగంతా మాయమై మా కళ్ళకు మబ్బులు కమ్మినట్టయి పైకి ఆకాశం వైపు చూస్తే పడమటి ఆకాశంలో దట్టమైన నల్లటి వర్షపు మేఘాలు ఇంతింతై ముందుకు చొచ్చుకువస్తున్నాయి. ఆకాశాన్ని మొత్తం ఆక్రమించు కుంటున్నట్టున్నాయి. కుండపోతగా వర్షం కురిసేట్టుంది. మేము వెనక్కి పరుగు పరుగున పోయినా ఇరవై నిమిషాలు పడుతుంది. ఎక్కడా తలదాచుకునేట్టు లేదు. మాకు నెమళ్ల దృష్టిపోయింది. ఆకాశంలో ముసురుకు వస్తున్న మేఘాల నెమళ్ల దండు, మీది మీదికి తరుముకు వస్తున్నట్టుంది.

తిరుగుముఖం పట్టి పరుగు తీశాం.

వర్షం అర్థగంట సేపు పైన కొండల్లో పడితే చాలు గెడ్డ పొంగుతుంది. అది పొంగక ముందు మేము గెడ్డ దాటెయ్యాలి. లేదా అడవిలో చిక్కుకు పోయినట్టే. ఇంకోదారి లేదు. ఈ గెడ్డ పొంగటం చేతనే ఒకటి రెండుసార్లు ఇటు రాలేకపోయాము.

ఎక్కడో ఓ మూల వర్షం దిగింది. చల్లటి వర్షపుగాలి. మట్టి వాసన. ఆకాశాన్ని చీల్చుతూ మెరుపులు. పైన రథాలు పరుగు తీస్తున్నట్టు, కొండచరియలు విరిగి అగాధంలోకి కూలిపోతున్నట్టు ఉరుములు. వర్షపుగాలుల తాకిడికి చెలరేగిన అడవి ఆకుల వాసనలు తెరలు తెరలుగా. ప్రకృతి భీషణంగా తయారయింది. పరుగుతీస్తున్న కుందేళ్లలాగ భయంతో, గెడ్డ దాటాలన్న తొందర మాలో.

అడవి మమ్మల్ని వెనక్కు తరిమేస్తున్నది. వర్షం వెంటాడి భయపెడు తున్నట్టుంది.

పెద్ద చినుకొకటి నా కళ్లద్దాల మీద పడి చిట్లింది.

మేఘాలను భగ్గున మండించినట్టు మరో మెరుపు. కందిరీగలు చుట్టు ముట్టినట్టు వర్షం. పదిగజాలు పరుగెత్తే లోపల తడిసిపోయాము. దారి కనిపించటం లేదు. గెడ్డ దాటే వరకు ఆగటానికి లేదు. తడిసిన బట్టలు ఒంటికి బిగుసుకున్నాయి. కళ్లలో వర్షం. నా కోసం ఆగి ఆగి పరుగెత్తుతున్నాడు సత్యం.

నా నెమళ్లఅడవియాత్ర, అక్కడ సత్యం పాడే పల్లెపాట ఆ వర్షానికి తడిసి

పోయాయి.

అలసిపోయాను. ఎక్కడన్నా కొంతసేపు ఆగితే బావుండును. కానీ, ముందు గెడ్డ దాటాలి. అంతవరకు ఆగనిచ్చేట్లు లేదు సత్యం. ఆగకుండా పరుగెత్తుతున్నాడు.

వర్షంలో తడుస్తున్న అడవి చెట్ల రంగులు అలుక్కుపోతున్నాయి.

గెడ్డ కనిపించింది. ఒడ్డుకు చేరాము. ప్రవాహం ఉప్పొంగిన జాడ ఇంకా లేదు. మోకాలు లోతు పాత ప్రవాహమే. అంతే, దాటిపోయాం.

అక్కడకు ఏభై గజాల దూరంలో చిక్కటి రావిచెట్టు కిందికిపోయి అక్కడ ఆగి కొద్దిసేపు అలసట తీర్చుకుని — మళ్లీ పరుగెత్తాలి. వర్షం ఇప్పుడిప్పుడే ఆగేట్టు లేదు. వర్షం వాలుదిశనుంచి తప్పించుకొంటూ మానుచాటున నుంచున్నాం. గెడ్డదాటిపోయిన సంతోషం. ఇక ఇల్లు చేరుకున్నట్టే. వర్ష దిగ్బంధం నుంచి బైటపడినట్టే. అడవిని జయించినట్టే. చలి. గజగజ వణకుతున్నా ఇప్పుడు భయంలేదు. నేను ఒక్కడినే వచ్చి ఉంటేనా! ఏ దారి పట్టేవాడినో? సత్యం తోడువల్ల నిశ్చింత. మరొక పరుగుతో రోడ్డు చేరుకుంటాం.

అలసట తగ్గింది. మళ్లీ కదలవచ్చు. ఈ వర్షం ఎంతసేపు ఇట్లా కురుస్తుందో, ఆగదా అనుకొంటూ పైకి రావిచెట్టు కొమ్మల వైపు చూస్తే కింది కొమ్మల మీద నెమళ్ల జంట.

మాకు మల్లె అవి కూడా దారి మధ్యలో వర్షంలో చిక్కుకొని ఇక్కడ ఈ చెట్టును ఆశ్రయించినట్టా? లేక ఇదే వాటి ఆశ్రయమా?

అవి మా వైపు అనుమానంగా బెదురుతూ చూస్తున్నాయి.

'వీటిని ఇక్కడ ఇప్పుడు పట్టుకుంటే.'

నాకే దుర్మార్గంగా ఉందా ఆలోచన. వాటిని పెంచుకోవటానికే కావచ్చు, వాటిని తీసుకుపోయి చంపకపోవచ్చు.

వాటిని చూసి ఆనందించాలనుకుని వచ్చిననాకే నిస్సహాయంగా అందుబాటులో అవి కనిపించేసరికి పట్టుకుని తీసుకుపోవాలనిపించటం! అంత ముద్దొస్తున్నాయవి. బరువుపింఛాన్ని మోస్తున్న ఆ మగనెమలి ఓసారి మెడ పొడవుగా చాచింది.

నా దుర్బుద్ధి వాటికి తెలిసినట్టే ఉంది. అవి పై కొమ్మల మీదికి వెళ్లిపోయాయి. అవి ముక్కుతో పొడుస్తాయట. వాటిని పట్టుకోవటం మాటలు కాదట. సత్యం మళ్లీ పరుగు అందుకున్నాడు. ఆ వెంట నేను. నెమళ్లను ఆ చెట్టుకు వదిలేసి పరుగు తీశాం.

* * *

ఆ రోజుతో సంక్రాంతి సెలవలు మాకు మొదలయినాయి. సంక్రాంతికి మా ఊరు వెళ్లాలి. అయితే ఆ నెల వేతనం ఇంకా రాలేదు. రెండు మూడు రోజుల్లో వస్తుందని ఎదురు చూస్తున్నాం. పైసలు అందుకుని బయల్దేరాలి. ధర్మారావు ఉత్తరం — ఈ సంక్రాంతికి మా కళామండలి, కామేశ్వరరావు కొత్త నాటకం 'రైలు ప్రయాణం' వేస్తున్నారట.

ఉత్తరాలు వచ్చే వేళయింది. తపాలా సంచి రోజూ మధ్యాహ్నం పన్నెండుకు ఈ ఊరు వస్తుంది. నాకు ఉత్తరాలు ఉంటే బ్రాంచి పోస్ట్‌మాస్టర్ విద్యార్థి నెవరినన్నా పిలిచి ఊరుకు ఫర్లాంగ్ దూరంలో మందిరం దగ్గర ఉంటున్న నాకు పంపిస్తాడు.

ఆ రోజు మందిరానికి వచ్చిన భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంది. గది పంచలో నర్సరావుపేట వాలుకుర్చీ వేసుకుని వచ్చే పోయే భక్తులను చూడటం గొప్ప కాలక్షేపం. పూజారి నూకయ్యగారు పూజ సమయంలో ఎర్రరంగు పట్టు పంచె కట్టుకుంటారు. నుదుట పొడవాటి కుంకుమ బొట్టు పెట్టుకుంటారు, అంతే. తలమీదమాత్రం క్రాపింగు. పూర్వాశ్రమంలో ఆయన రైల్వే డ్రైవర్. ఆయన గురువుగారు దేవీ ఆరాధకుడు. ఆ గురువుగారు కూడా రైల్వే డ్రైవరే. పదవీ విరమణ తర్వాత గురువుగారు ఖరగ్‌పూర్ విడిచిపెట్టేసి స్వగ్రామం చేరుకుని, ఊరుకు దాదాపు ఫర్లాంగ్ దూరంలో దక్షిణంగా ఉన్న ఈ మెట్టమీద దేవీమందిరాన్ని నిర్మించి పూజలు ఆరంభించారు. దాంతో ఆయన శిష్యులంతా ఈ ఊరు రావటం మొదలు పెట్టారు. గురుశుశ్రూషకోసం ఆ రకంగా వచ్చిన నూకయ్యగారు గురువుగారు కాలధర్మం చెందిన తర్వాత దేవీపూజలు కొనసాగిస్తూ పూజారయ్యారు.

ఆయన చిరునవ్వు, దేవీ ప్రసన్న వదనం భక్తులను ఆకర్షించాయి.

ఆరేడు నెలలుగా ఇక్కడ నూకయ్యగారితో నేను ఉండటంతో చాలామంది ఇరుగు పొరుగు గ్రామాల భక్తులకు సైతం నేను పరిచితుణ్ణయ్యాను. వాళ్లు పలకరించి మరీ వెళ్తారు. అట్లా ఓ భక్తునితో మాట్లాడుతూ ఉండగా ఆరో తరగతి విద్యార్థి ఒకడు పరుగు పరుగున వచ్చి రెండు ఉత్తరాలు నా చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. రెండూ ఇన్‌లేండ్ ఉత్తరాలే. ఒకటి విఠల్ నుంచి.

ఇక్కడ జిల్లా పరిషత్ వాళ్లు కొత్తగా పెట్టిన ఉన్నతపాఠశాలలో నాకు బి.ఇడి శిక్షణ ముగిసిన వెంటనే ఉద్యోగం దొరికిందంటే అది విఠల్ చలవే. ఆ సంస్థలో ఉద్యోగిగా తన పలుకుబడిని ఉపయోగించి చేసిన సహాయమే. మొదట్లో ఈ ఊరు

రావటం నాకు ఇష్టం లేదు. వేరే ఏ ఊరన్నా సంతోషంగా వెళ్లేవాడినే. ఇది మన్యం ప్రాంతమనీ, దోమకాటు, చలిజ్వరాలతో మనుషులు చచ్చిపోతున్నారనీ, చలికాలం ఎముకలు కొరికే చలనీ, ఎండాకాలం నిప్పులు చెరిగే ఎండలనీ భయపెట్టారు. ఊరు మార్పు కావాలని విఠల్‌తో మాట్లాట్టానికి వెడితే ఆయన చాలాసేపు నవ్వి "ఆ ఊళ్లో మనుషులు బతికే ఉన్నారు. పోయి చూసి నమ్మకం కలిగిన తర్వాతే ఉద్యోగంలో చేరు" అన్నాడు. వచ్చి చూస్తే నిజమే అనిపించింది. ఆ ఊళ్లో ఆస్పత్రి కూడా లేదు. మన్యం జ్వరాలు పాతకాలపు మాటేగాని ఇప్పటి మాట కాదు.

ఆయన రాసిన ఉత్తరంలో ధర్మారావు రాసిన సంగతే. సంక్రాంతి రోజున కామేశ్వరరావు కొత్త నాటకం 'రైలు ప్రయాణం' ప్రదర్శన. దాంట్లో ఒక పాత్రలో విఠల్ నటిస్తున్నాడట, తప్పనిసరిగా రమ్మని. ఆ ఉత్తరం ముగింపులో మా మిత్రులు శాస్త్రి దంపతులకు జాబిల్లిపేట బదిలీ అయిందనీ, వాళ్లు అక్కడ చేరిపోయారనీ తెలియజేశాడు.

కాలమే కొన్ని సమస్యలను పరిష్కరిస్తుందంటారు. ఇప్పుడు నాకు అదే అనిపించింది. సత్యం సమస్యకు పరిష్కారం దొరికినంత సంతోషమయింది. ఇప్పుడు ఆ ఊళ్లో అడుగుపెట్టటానికి నాకు కొంత చోటు దొరికింది.

ఇప్పుడు ఈ సమస్య పరిష్కారభారం శాస్త్రి మీద వేయవచ్చని ధైర్యం. ఇటువంటి వ్యవహారాలు చక్కబెట్టడంలో శాస్త్రికి కావలసినంత చొరవ, సహాయ స్వభావం, మంచితనం ఉన్నాయి. ఓసారి వెళ్ళి శాస్త్రితో మాట్లాడి రావచ్చునను కున్నాను.

వెళ్లాలి, వెళ్లాలి అనుకుంటూనే మరో మూడు మాసాలు గడిచిపోయాయి. వస్తున్నట్టు మధ్యలో రెండు ఉత్తరాలు రాశాను. చివరి నిమిషంలో ఆటంకాల మూలంగా వెళ్లలేకపోవటం, సంజాయిషీ రాసుకోవటం కూడా అయింది.

ఈసారి వస్తున్న సంగతి ముందస్తుగా రాయకుండానే ఓ ఉదయం సెలవు రోజున పదిగంటలకల్లా జాబిల్లిపేట చేరుకున్నాను. ఇట్లాంటి ఊళ్లల్లో ఉపాధ్యాయులఇల్లు వెతుక్కోవటం సమస్య కాదు. ఎవరో విద్యార్థి తీసుకుపోతాడు. నేను వెళ్లేసరికి శాస్త్రి, సావిత్రమ్మగారు ఇంట్లోనే ఉన్నారు. సావిత్రమ్మగారు ఇంగ్లీషు దినపత్రిక చదువుకుంటున్నారు. శాస్త్రి గెడ్డం గీసుకుంటున్నాడు.

నవ్వులు, పలకరింపులు, స్నేహితులముచ్చట్లు, బదిలీలు, కాఫీలు, ట్యూషన్ ఆదాయాలు, ఊళ్లో రాజకీయాలు అన్నీ కలబోసుకున్న తర్వాత నేను వచ్చిన పని

గురించి చెప్పాను. సత్యం కథ విని ఆ ఇద్దరూ బాధపడ్డారు. సత్యం అత్తవారి ఇల్లు ఆస్పత్రి వెనుక వీధిలో, పెద్ద తులసికోట దగ్గర్లో టైలర్ షాప్‌కు తూర్పుగా ఉన్నట్టు చెప్పాను.

శాస్త్రి ఇక్కడకు బదిలీ అయి కూడా నాలుగు మాసాలకు పైనే అయింది కాబట్టి ఆ ఊళ్లో ముత్యాలు అనే పిల్ల గురించి తెలిసే ఉంటుంది. తన తోటి ఉపాధ్యాయుడే కథానాయకుడు అయినప్పుడు తెలియకుండా ఉండటం అసంభవం అనిపించింది.

కలకత్తా — మద్రాసు జాతీయ రహదారికి పదిహేను కిలోమీటర్ల పడమరగా ఏటి ఒడ్డున ఉత్తరంగా ఉన్న జాబిల్లిపేట రెండు పంటలు పండే సారవంతమైన పొలాలతో సంపన్నమైన ఊరులా కనిపించింది. ఏటి సమీపాన మెట్టమీద పురాతనమైన పెద్ద రాతి దేవాలయం. దానికి ఓ అరకిలోమీటరు దూరంలో పూర్వపు జమీందార్లు కట్టించిన పాతకాలపు కట్టడం పాఠశాల భవనం కనిపించాయి. దేవాలయం రాతి ప్రహరీగోడ రెండు మూడు చోట్ల కూలిపోయి, గ్రామస్థుల నిరాదరణకు గురయినట్టు కనిపించింది. పాఠశాల భవనం ఇటుకగోడలు పగుళ్లతో కూలటానికి సిద్ధంగా ఉన్నట్టనిపించాయి. ఆ ఊళ్లోమనుషుల ముఖాలు ఈ బతుకుజూదంలో ఓడిపోయి చితికి పోయినట్టు కనిపించి మనసులో జంకు పుట్టింది నాకు.

ఎండాకాలం మొదలుకావటంతో ఏరు సన్నటి పాయలా పారుతున్నది. చెలమల్లోంచి నీళ్లు తోడుకుని బిందెల్లో, మట్టి కడవల్లో నింపుకుని ఆ ఊరు ఆడపడుచులు తెచ్చుకుంటున్నారు.

'ఈ పాఠశాల, ఈ దేవాలయం ఇట్లా ఉన్నాయేం?' అని అడిగితే, దేవాలయభూముల్ని ధర్మకర్తలు కబళిస్తున్నారనీ, ఊరు విడిచిపెట్టి ఇప్పుడు వాళ్లు హైదరాబాద్‌లో ఇళ్లుకట్టుకుని అక్కడే ఉంటున్నారనీ, పాఠశాల మరమ్మతుకోసం ప్రభుత్వం మంజూరు చేసిన చాలీచాలని మొత్తాలను కాంట్రాక్టర్లూ, ఇంజనీర్లూ, ఉద్యోగులూ వాటాలు పంచుకుని తినేస్తున్నారనీ శాస్త్రి జవాబు.

"ఈ ఊళ్లో మనుషులేమిటి ఇట్లా ఉన్నారు, ఒక నవ్వుముఖం కనిపించలేదు."

"నా ముఖంలో కూడా నవ్వు కనిపించలేదా నీకు!" అని శాస్త్రి పరిహాసం.

"అన్ని ఊళ్లలాగానే ఉందీ ఊరు. ఎటొచ్చీ డబ్బున్న ఊరు కాబట్టి కోర్టుల్లోనూ, ఆస్పత్రుల్లోనూ పెద్దలకు కాలక్షేపం. ఊళ్లు ఇప్పుడు శాశ్వత శత్రుశిబిరాలుగా తయారయ్యాయి. పార్టీల పుట్టలయ్యాయి. ఏ పుట్టలో ఎన్ని పాములున్నాయో, ఏ

పాము ఎప్పుడు ఎవర్ని కరుస్తుందో" అని శాస్త్రి వ్యాఖ్యానం.

చాలాసేపు ఏటిఒడ్డున దేవాలయాన్నీ, ఆ పాతకాలపు పాఠశాల భవనాన్నీ, ఏరునీ చూసి తిరిగి ఇల్లు చేరుకున్న తర్వాత ఆ ఊళ్లో ఏదో పెద్ద దోషమే ఉందనిపించింది. ఆ ఊళ్లో దుర్మార్గం, ఉన్మాదం ఎదురులేని పెత్తనం చేస్తున్నట్టు కనిపించసాగింది.

ఆ సాయంత్రం ముత్యాలు ఇంటికి వెళ్లి ఆ పిల్లతో మాట్లాడాలని నేను అన్నప్పుడు, మేము వెళ్లటంకన్న ఆ పిల్లనే ఇంటికి పిలిపించవచ్చునని సావిత్రమ్మగారు సలహా ఇచ్చారు. అదే మాకూ నచ్చింది. ఈలోపు వాళ్లకు నీళ్లు తెచ్చి పోసే చిన్నమ్మకు కబురు చేశారు సావిత్రమ్మగారు, ఆమెతో చెప్పి ముత్యాలును పిలిపించాలని.

మేము భోజనాలు చేస్తూఉండగా చిన్నమ్మ వచ్చింది. కాయకష్టంతో చేవతేలిన నలభై అయిదేళ్ల చిన్నమ్మ ఆ ఊళ్లోనే పుట్టి, ఆ ఊళ్లోనే పెరిగి, ఆ ఊళ్లోనే పెళ్లిచేసుకుని, ఏటినీళ్లు మోసి పెద్దరైతులకూ, మేష్టర్లకు పోస్తున్నదట. చిన్నమ్మ మొగుడు స్కూల్లో ప్యూనట. చాలా నమ్మకమైన మనిషి.

చిన్నమ్మ ఆ రాత్రి తొమ్మిది గంటలప్పుడు చెప్పిన విషయ మేమిటంటే, ముత్యాలు, తల్లి కాంతమ్మ ఈ ఉదయమే పొరుగూళ్లో బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారని, రెండు మూడు రోజులు తర్వాతగానితిరిగి రారని. అంటే నేను మరోసారి ఇక్కడికి రావాలన్న మాట. ఈ లోగా ముత్యాలుతో మాట్లాడే బాధ్యతను శాస్త్రిదంపతుల మీద పెట్టి రెండోరోజు ఉదయమే నేను తిరుగు ప్రయాణం కట్టాను.

చిన్నమ్మ చెప్పిన మాటలను బట్టి ముత్యాలు గురించి ప్రచారమౌతున్నవన్నీ కట్టు కథలేననీ, వాటిలో ఏమాత్రం నిజం లేదని రుజువయినందుకు నా మనసు తేలికపడింది. ఆ పిల్లకు ఏ మేష్టరుతోనూ ఎప్పుడూ సంబంధం లేదట. అట్లాంటి సంబంధం ఉన్న ముత్యాలు వేరే ఉందట. అయితే, తల్లి కాంతమ్మకు మాత్రం మొగుడు బతికున్న రోజుల్లోనే ఆ ఊరుకు వచ్చిన ఒక డాక్టరుతో సంబంధం ఉండేదట. ఇప్పుడు ఆ డాక్టరు బదిలీ మీద వేరే ఊరు వెళ్లిపోయినా, అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉంటాడట. మొగుడికి తెలిసినా, చూసీ చూడనట్టు ఉండేవాడట. డాక్టర్ చాలా మంచి మనిషట.

ముత్యాలుకు పెళ్లయిన రెండో నెల ఆ ఊరు ఏటి ఒడ్డున మెట్ట మీద శివాలయం దగ్గర జరిగిన శివరాత్రి సంబరాలకు తోటిఆడపిల్లలజట్టుతో వెళ్లినప్పుడు

ఆ ప్రాంతం ఎమ్మెల్యే తమ్ముడు, వాడి స్నేహితులు నలుగురూ కలిసి ముత్యాలును ఎత్తుకుపోయి, ఒక రాత్రంతా ఉంచుకుని తెల్లారి వదిలేశారట. దాంతో ఆ పిల్ల మొగుడు దగ్గరకు వెళ్లనని, తన బతుకు పాడుచేసిన ఆ అయిదుగుర్నీ ఊరి అమ్మోరు తినేసిననాడు కాపురానికి వెళ్తాననీ ఒట్టు పెట్టుకున్నదట. వాళ్లలో ఒకడు రెండేళ్ల కిందట పొలంలో పాముకాటుకు చచ్చాడట. మిగిలిన నలుగురూ వాడిలానే చస్తారని ఆ పిల్లకి ఇప్పుడు నమ్మకం ఏర్పడిపోయింది.

ఇట్లాంటి పట్టుదల పెంచుకున్న పిల్ల పెనిమిటితో కాపురం ఎప్పుడు చేస్తుంది? ఇదేమైనా సత్యకాలమా, ధర్మదేవత ఆగ్రహానికి పాపాత్ములు కాలి మసైపోవడానికి! తన ఉసురు వాళ్లకు తగులుతుందని, మరిడమ్మ వచ్చి వాళ్లను నొల్లేస్తుందని ఆ పిల్ల మొండినమ్మకం. పాపాత్ములే పదికాలాల పాటు బతికి దేశాన్ని ఏలుతుండటం మనం చూడటం లేదా? ఆ ఊరు ముఖమ్మీదే ఆ సత్యం కనిపిస్తున్నది కదా. ఏ కట్టెలో అగ్గి ఉంటే ఆ కట్టే కాలిపోతుందనుకుంటే ఆ అమాయకత్వాన్ని పోగొట్టటం కష్టమే. అగ్గి ఉన్న కట్టె ఊరంతటినీ దగ్ధం చేయవచ్చు. తర్వాత అది కాలిపోతేనేం, కాలకుండా మిగిలిపోతేనేం.

జాబిల్లిపేట నించి తిరిగి వచ్చిన తర్వాత సత్యం నన్ను కలిసి అడిగినప్పుడు నా పాతసలహాలో అన్యాయం నాకర్థమై ఉన్నదున్నట్టు చెప్పాలనుకున్నాను. ముత్యాలుకు నా మూలంగా ఎలాంటి అన్యాయమూ జరగకూడదు. ఏ దోషమూ, ఏ తప్పూ ఎరగని ఆ అమాయకపు పిల్లను శిక్షించటం ద్రోహం.

సత్యం సమస్యను పరిష్కరించటానికి ఇంకో దారి ఉంది. 'ఇదుగో ఇదీ వాస్తవం. ఆ అయిదుగురు కీచకుల్లో ఒకడు పాము కరచి చచ్చాడు. ఇంకా నలుగురు మిగిలారు. వాళ్లను చంపు. అప్పుడు నీ పెళ్లాం నీ దగ్గరకు వస్తుంది. నీ పెళ్లాం పట్టిన పట్టు అది' అని ఉన్న సంగతి ఉన్నట్టుగా చెప్పవచ్చు. సత్యం వాళ్లను చంపనూవచ్చు. దాని ఫలితం సత్యం జైల్లో పడటమే తప్ప పెళ్లాంతో కాపురం చేయటం మాత్రం కాదు. ఏమో ఉరిశిక్ష కూడా పడవచ్చు. సత్యానికి నిజం చెప్పటం వల్ల ఒనగూడే మేలు ఏమీ కనిపించలేదు.

ఈ కారణాలవల్ల సత్యం కలిసినప్పుడు "శాస్త్రిగారు నా స్నేహితుడు. ఆయన మీద ఈ బాధ్యత పెట్టాను. ఆయన నీ సమస్యను సులభంగానే పరిష్కరించగలుగుతాడు. ఆయన తోడ్పాటు మనకు ఉంటుంది. అయితే, నువ్వు అనుకున్నంత తొందరలో పని జరగకపోవచ్చు. ఏమో మీ ఇద్దరి రాత ఎలా ఉందో?

ఆలస్యంగానన్నా నీ పెళ్లం నీ దగ్గరకు రావటం ఖాయం" అన్నాను, అనవసరమైన ఆశ కల్పించకూడదని.

నా మాట విని పెళ్లాం రేపే కాపురానికి వస్తున్నంత సంబరపడ్డాడు సత్యం.

ఒక సంగతి మాత్రం నిజం. కథ ఇప్పుడు ఎక్కడ వేసినది అక్కడ లేదు, కొంత ముందుకు సాగింది.

* * *

వేసవి సెలవలు మొదలయ్యాయి. శిరోమణి చెల్లెలు సుజాత పెళ్లి మా ఊళ్లో ఈ మే నెల రెండవ వారంలో ఉంది. ఈ వేసవి సెలవలకు డూన్ నుంచి రామారావు, శ్రీనగర్ నుంచి గురుమూర్తి, ఝాన్సీ నుంచి కృష్ణన్నయ్య, బాంబే నుంచి వెంకటరత్నం వస్తారని ఊరు వెళ్లే హడావిడిలో పరీక్ష పేపర్లు దిద్ది ఇచ్చేయటం, మార్కుల జాబితాలు అందజేయటం, నా క్లాస్ ప్రోగ్రెస్ కార్డులు తయారుచేయటం పనుల్లో నిండామునిగి ఉండగా, ఓ సాయంత్రం ముద్దుకృష్ణ, ధర్మారావు, శిరోమణి, కామేశ్వరరావు వచ్చి వాలారు. బస్టాండ్ దగ్గర పండా టీ కొట్టు ముందు వాళ్ల నలుగుర్నీ చూసి, వాళ్లను దేవీ మందిరం దగ్గర నా గదికి తీసుకుని వచ్చింది సత్యమే. నా నెమళ్లఅడవి ఉత్తరాలు వాళ్లను అక్కడకు తీసుకుని వచ్చాయని వాళ్ల భుజాలకు వేలాడుతున్న కెమేరాలను చూస్తే తెలుస్తుంది. నెమళ్లఅడవిని వినోదపర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనుకున్న నా నిర్మాణపథకంలో తొలి వినోదపర్యాటకులుగా ఈ నలుగుర్నీ కీర్తించవచ్చు.

మా ఊరు నుంచి ఇక్కడకు మూడు గంటలు బస్ ప్రయాణం.

"చాలా చాలా అందమైన ఊర్రా సంజీవ్" పలకరింపు నవ్వుతోనే మెచ్చుకున్నాడు ముద్దుకృష్ణ. మూడేళ్ల తర్వాత చూడటం ముద్దుకృష్ణని. వదులు టీ షర్ట్‌తో, జీన్స్‌తో, పెంచి పోషిస్తున్న చిన్నపాటి నల్లటి దట్టమైన గడ్డంతో, మహానగరపు నాజూకు మోటుతనం ముఖాన కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

"ఘాట్ రోడ్ రెండు వైపులా పర్వతారణ్యాలూ, లోయలూ... నీవు రాసిన దానికన్నా గొప్పగా ఉంది ఇక్కడి ప్రకృతి" అన్నాడు శిరోమణి. ముతక ఖద్దరు ఊదారంగులాల్చీ, పైజామాతో, ఆకుచెప్పులతో, అలవాటైపోయిన వృత్తిపరమైన నవ్వుముఖంతో, భుజాలు ఎగరవేసి రెండు చేతులూ బార్లా చాపి విసిరి పొగడ్తను చేతులతో ప్రదర్శించాడు, కొత్త అలవాట్లతో.

వీళ్లిద్దరూ వయసులో నా కన్నా రెండు మూడేళ్లు పెద్దవాళ్లు. సహజంగా భారీ శరీరాలే అయినా, వాటిని గీత గీసి అదుపులో ఉంచినట్టు కనిపించారు. ఇద్దరూ ఈ ప్రయాణాల వల్లనో ఏమో చిక్కనట్టే ఉన్నారు.

పడమటికి ఎదురుచేసిన దేవీమందిరానికి ఈశాన్యంగా దగ్గర్లోనే పడమటికే ఎదురుచేసిన మా రెండుగదుల పాక. మందిరానికి దక్షిణంగా వందలాది రకాల మందారాల పూలతోట. అక్కడ ఆ చుట్టూ ఉన్న ఎండాకాలపు ఖాళీపొలాలు, మధ్యమధ్య అప్పుడే మొలకెత్తుతున్న చెరకుపొలాలు, వందగజాల దూరంలో దక్షిణ ఉత్తరాలుగా పోతున్న రోడ్డు, ఆ వెనుక వరుసలు వరుసలుగా తూర్పు కనుమల పర్వతపంక్తులు. వాటిని చూస్తూ నోట మాట రాక ఆ పంచలోని సిమెంటు అరుగు మీద కూర్చున్నారు ధర్మారావు, కామేశ్వరరావు.

సముద్రపు ఒడ్డు గ్రామం నుంచి కొండల మధ్యకి రావటం వల్లనేమో ఈ కొత్త అనుభూతి వాళ్లకి. ఏడాదిన్నర కిందట ఇక్కడ నా తొలి ఉద్యోగంలో చేరటానికి వచ్చినప్పుడు దారి పొడుగునా పొంగి ప్రవహిస్తున్న సెలయేళ్లు, కాలువలు, తడుస్తున్న అడవులు, వర్షపు నీళ్లు నిలచిన పచ్చినేల, పచ్చటి కొండలు, చేతికి అందుతున్నట్టుగా చెట్ల మీదికి వాలిన మేఘాలు... ఆ అందంతో మనసు ఉక్కిరిబిక్కిరయింది. ఆ కొత్త అందాలు నా స్నేహితుల్ని సైతం ఆకర్షించినందుకు ఇప్పుడు నాకు ఉత్సాహంగా ఉంది గర్వంగా ఉంది.

బాంబే చలనచిత్రరంగం తనకు పడలేదట. ఢిల్లీ వచ్చి ఆకాశవాణిలో తిరిగి చేరిపోయాడట. రెండు మూడేళ్లలో ఆ ఉద్యోగం మానుకోవాలను కుంటున్నాడట. ఇప్పుడిప్పుడే దేశంలో మొదలయిన కొత్తసాంస్కృతిక పునర్వికాసంతో చేతి నిండా అవకాశాలున్నాయట. తను సంగీత కచ్చేరీల మీద గౌరవంగా బతకవచ్చు అంటున్నాడు ముద్దుకృష్ణ. ఆత్మవిశ్వాసం పట్టుతో మాట్లాడుతున్నాడు. పెళ్లివిషయమై వాళ్ల అమ్మగారి ఫిర్యాదుల గురించి గుర్తుచేస్తే, తన పెళ్లి భాషాంతరమూ, రాష్ట్రాంతరమూ, ఏమో మతాంతరం కూడా కావచ్చునన్నాడు, చైతన్యానికి, సంస్కారానికి పరిధులు తానే శాసిస్తున్నట్టు.

తన అతిథులకు పెట్టే తిండిని బట్టి ఉంటుంది ఆ ఊరు ఘనత. తల్లిలా అభిమానంతో భోజనం పెట్టే పండా వంటలను నా స్నేహితులు ఆ రాత్రి పదే పదే మెచ్చుకున్నారు. పండా ఒరియా వాడన్న మాటేగానీ ఆ పూట వండినవి ఒరియా వంటకాలు కావంటున్నారు. మేమంతా సరిహద్దు ప్రాంతాల వాళ్లం కాబట్టి ఒరియా

రుచులు తెలిసినవాళ్లమే. అరవయ్యేళ్ల పండా ఆ ఊళ్లో నాకున్న ముగ్గురు నలుగురు స్నేహితుల్లో ఒకరని నేను గొప్పచెప్పుకుంటుంటే విస్తుపోయి నా ముఖం చూసిన మిత్రులు మా కోసం ఆ రాత్రి పెట్టిన విందు భోజనం తిని నమ్మారు. పండా నలభైయేళ్ల పాటు ఒరిస్సా రాజకుటుంబాలలో, పెద్దపెద్ద జమీందారీ కుటుంబాలలో వంటమనిషిగా దేశం నలుమూలలా తిరిగి పేరుమోసినవాడు. ముసలితల్లికోసం అయిదేళ్ల కిందట సొంత ఊరు వచ్చేసి కాలక్షేపానికి ఇప్పుడు టీకొట్టు నడుపుతున్నాడు. ఊళ్లో కొత్తగా ఉన్నత పాఠశాల పెడుతున్నప్పుడు సర్పంచి నాయుడు "ఈ కొత్త పంతుళ్లు కొన్నాళ్లు మన ఊళ్లో ఉండాలంటే వాళ్లకు భోజన సదుపాయం ఉండాలి. నీ సహాయం అది" అని పండా దగ్గరకు వెళ్లి వినమ్రతాభావంతో చెప్పినప్పుడు సంతోషంగానే సరే అన్నాడు పండా. ఇప్పుడు ఆరుగురం ఉపాధ్యాయులం అక్కడ భోజనం చేస్తున్నాం.

మేము దేవీమందిరానికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. నూకయ్యగారు ఏకతార శ్రుతిగా బ్రహ్మంగారితత్త్వాలు పాడుకుంటున్నారు. ఆయన పడుకునే ముందు రోజూ చేసే కార్యక్రమమది. అట్లాగే వేకువజామున ఏకతార నాదం మీద బ్రహ్మంగారి తత్త్వాలు మంద్రంగా వినిపిస్తాయి. మేము రావటం చూసి ఆయన ఏకతార పక్కకు పెట్టి బయటికి వచ్చి మాతో కూర్చున్నారు. ఆ సాయంత్రం నుంచి సత్యం మాతోనే ఉన్నాడు. మా మిత్రులందరికీ వాకిట చాపలు వేసి పక్కలు ఏర్పాటు చేస్తున్నాడు సత్యం.

చెట్టుకో పిట్టలా బతుకుపరుగులో దేశమంతటా చెదిరిపోయిన మిత్రులను గుర్తు చేసుకుంటున్నాం.

"మన స్నేహితుల్లో ముందుగా మన ఊరు విడిచి వెళ్లిపోయినవాడివి నువ్వే" అన్నాను ముద్దుకృష్ణతో. ఇంటర్మీడియట్ ముగియటంతోనే ఢిల్లీలో పడ్డాడు. అక్కడ ఢిల్లీవిశ్వవిద్యాలయంలో వాళ్ల చిన్నాన్న ప్రొఫెసర్. అక్కడ సంగీత విద్వాంసుల దగ్గర శిక్షణ, సంగీత కళాశాలలో చదువు మంచిదని ముద్దుకృష్ణను తీసుకుపోయాడాయన.

"దేశ రాజధాని ఢిల్లీ మహానగరానికి మన ఊరు ముద్దుకృష్ణను కానుకగా బహూకరించింది" అన్నాడు, ఇప్పుడు హైదరాబాద్‌లో ఇంగ్లీషు దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్న శిరోమణి. తెలుగు పండిత కుటుంబాలలో పుట్టి, ఇంగ్లీషు కలం పట్టుకున్న శిరోమణిని రాష్ట్ర రాజధానికి బహుకరించింది మా ఊరు.

"నిన్ను హైదరాబాద్‌కు విక్రయించింది మన ఊరు" అన్నాడు నవ్వుతూ

కామేశ్వరరావు, మా కళామండలి ఆస్థాన రచయిత.

శిరోమణి ఉత్తరాల నిండా మురికివాడల్లాంటి నగరసంస్కృతి మీద ఆగ్రహ విమర్శలే. కానీ, తిరిగి స్వగ్రామం వస్తే ఓ చిన్న ముద్రణాలయాన్నన్నా నడుపుకోగలడా? డిగ్రీలు చదువుకున్న పాపానికి నగరాలకు అమ్ముడుపోతున్న పల్లెటూళ్లలోని విద్యావంతుల దుస్థితి మీద విమర్శ అది.

"రామారావును డూన్ స్కూల్ లాక్కుంది."

"సమకాలీన ఆంగ్లసాహిత్యంలో కనిపించే కొత్తకొత్త రచయితలను, కవులను చదివి, మాతో చదివించి, మాఊరు గ్రంథాలయం ముందు గంటల తరబడి చర్చలు రేకెత్తించే రామారావును డూన్‌కు పంపించేయటం కన్నా మన ఊరు దౌర్భాగ్యం ఏముంటుంది? మన ఊళ్లోనే ఉంటే ఎంతమంది రచయితలు, కవులు వెలసేవారో కదా! ఈ అడవులూ, ఈ కొండలూ, ఈ నెమళ్లూ ఇంత అందంగా కనిపిస్తున్నాయంటే రామారావు గుండెల్లో చల్లిన చల్లని అత్తరు స్పర్శే కారణం."

"నాటకాలు రాయటానికి నాకు ప్రేరణ రామారావే" అన్నాడు కామేశ్వరరావు. స్నేహమే అయినా, రామారావు పట్ల గురుభావం అందరికీ. 'రైలు ప్రయాణం' నాటక ప్రదర్శన రచయితకీ, దర్శకుడికీ కాకుండా నటుడు పాణిగ్రాహికి పేరు తెచ్చిపెట్టిందట.

మా కళామండలి ధర్మారావు, కామేశ్వరరావుల పట్టుదలతో మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లడం అభినందనపాత్రమయింది. ధర్మారావు ఈమధ్య ఓసారి మద్రాసు, మరోసారి హైదరాబాద్ వెళ్లి వచ్చాడు. చలనచిత్రరంగం వాళ్లను పిలుచుకుంటే ముద్దుకృష్ణ, రామారావుల సారథ్యంలో ప్రారంభమైన మా కళామండలిని నడిపించేవాళ్లు ఎవరవుతారో అన్నది చర్చనీయాంశం అయింది. కళామండలి ప్రాభవం ఇంతటితోనే ముగుస్తుందా? ఆంధ్రుల ఆరంభశూరత్వానికి ఉదాహరణగా చెప్పుకుంటారా?

పతంజలి పెళ్లి ప్రస్తావన వచ్చింది.

"దగ్గర్లో ఉన్నాడన్న మాటేగాని బరంపురం వదలిరాడు పతంజలి. నేను ఈ ఊరొచ్చి ఏడాదిన్నర కావచ్చినా, ఒక్కసారి కూడా రాలేదు. ఇప్పుడాయన కరుణ హృదయుడు."

"కరుణ కోసం క్రైస్తవం స్వీకరిస్తాడో లేక ఆమె తన మతం మార్చు కుంటుందో?"

"ఇద్దరూ మత స్వాతంత్ర్యాన్ని ప్రకటించవచ్చు."

రెండేళ్లుగా నలుగుతున్న పాత కథే. చెప్పుకుని నవ్వుకున్నాం.

ఇలా మేము ముచ్చట్లలో ఉండగా మందిరానికి పడమరగా, నూతికి దిగువగా ఉన్న పంటల్లేని పొలాల నుంచి కమ్మని బృందగానం వినిపించింది.

మా మాటలూ, నవ్వులూ ఒక్కసారి ఆగిపోయాయి. ఆ గానం మొదట ముద్దుకృష్ణ చెవిలోనే పడినట్టుంది. మా చూపులు అటు వెతకసాగాయి. వెన్నెల్లో నీడల్లా ఓ గుంపు కనిపిస్తున్నది. దగ్గర్లో ఉన్న సంతకు పోతూ రాత్రిపూట సవరలు ఇక్కడ మజిలీ చేస్తారు. వాళ్లు కొండ ఊళ్లలో రాత్రి తిని బయల్దేరి ఉంటారు. అర్ధరాత్రి వరకు పాటలు పాడుకుని నిద్రపోయి, వేకువజామునే లేచి మళ్లీ సంతకి బయల్దేరతారు. తాము సంతలో అమ్ముకోడానికి తెచ్చుకున్న వస్తువులతో నిండిన గంపలూ, కావుళ్లూ అక్కడే పెట్టుకుంటారు. వాళ్లకు ఇక్కడున్న సదుపాయమంతా తాగటానికి ఆ నూతిలో నీళ్లు. దారినపోయే వాళ్ల కోసం అక్కడ ఓ బకెట్ ఎప్పుడూ ఉంటుంది. అవసర మయితే పూజారి దగ్గరకుపోయి, అగ్గిపెట్టె అడుక్కుంటారు. ఈ రెండు సదుపాయాల మూలంగానే ఆ సవరజట్టుకు ఇది మజిలీ చోటయింది.

పొలం నుంచి పాట శ్రావ్యంగా వినిపిస్తున్నది.

ముద్దుకృష్ణ తన టేప్‌రికార్డర్‌ని బేగ్ నుంచి బయటికి తీసి వాళ్లున్న చోటుకు వెళ్లటానికి సిద్ధమవుతున్నాడు. శిరోమణి తన కెమేరాని సిద్ధం చేస్తున్నాడు. అక్కడికి వెళ్లి వినటానికి తయారవుతున్నాడు కామేశ్వరరావు.

"మీరు అక్కడికి వెడితే పాట ఆగిపోతుంది." నా అనుభవం చెప్పాను. "పాట ఆపకుండా వినాలనుకుంటే ఇక్కడ నుంచి కదలకూడదు మనం."

"వెళ్లొద్దు" అన్నాడు సత్యం.

దాంతో ముద్దుకృష్ణ మనసు విలవిలలాడింది.

"ఆ పాటనెట్లాగన్నా రికార్డ్ చెయ్యాలి." అదీ ముద్దుకృష్ణ పట్టుదల.

సత్యం ప్రయత్నిస్తే అవుతుంది. సత్యం సహాయం కావాలి. దానికి సత్యం ఒప్పుకోటడం లేదు. వాళ్లు ఆ పాట సగంలో ఆపేయటం సత్యానికి ఇష్టం లేదు. 'మనం వెళ్తే వాళ్లు పాడరు' అంటాడు. అది నిజమే. నోరు విప్పకుండా వింటూ ఉండిపోయాం.

పాట ఆగిపోయింది.

కొంతసేపటి తర్వాత ఓ సవరకుర్రవాడు మా వైపు రావటం కనిపించింది.

మాకు తూర్పున ఒకగదిలో పూజారి నూకయ్యగారు. ఆ గదిలో లాంతరు వెలుగు. ఆయన నిద్రపోయినట్టు లేదు. పాట వింటున్నట్టున్నారు.

"అగ్గిపుల్ల పెట్టి." అంతే వాడికి తెలిసిన తెలుగు.

వెన్నెల్లో మునిగి వచ్చినట్టుగా ఆ శరీరం మీద చందమామ అలంకారాలు. పద్దెనిమిదేళ్లు కూడా ఉండవేమో. మొలకు గోచీ పెట్టి గావంచా కట్టుకున్నాడు. ఒంటి మీద మరో గుడ్డ లేదు.

సత్యం ఇదే అదను అనుకున్నాడోఏమో తన దగ్గరున్న అగ్గిపెట్టె తీసి ఇచ్చాడు. "ఇవి తీసుకో" అని తన బనీను జేబులో ఉన్న బీడికట్ట తీసి, ఆ కుర్రవాడికి ఇచ్చి అతని వెంట వాళ్లున్న చోటుకు వెళ్లాడు, అగ్గిపెట్టె వెనక్కి తెచ్చుకునే నెపం మీద. పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చి చెప్పాడు. మేము వాళ్లున్న చోటుకు రాకుండా ఇక్కడే ఉన్నట్టయితే పాడతారట. టేప్‌రికార్డర్ పెట్టెను వాళ్ల దగ్గర విడిచిపెట్టి రికార్డ్ చేసుకోవటానికి ఒప్పుకున్నారట.

ఆ ఏర్పాటుతో ముద్దుకృష్ణ కోరిక తీరి సంతృప్తి చెందాడు. ఎటొచ్చీ శిరోమణి కోరిక తీరే అవకాశం లేదు.

టార్చ్‌లైట్ ఇచ్చి, టేప్‌రికార్డర్‌లో ఏది నొక్కి పాడే వాళ్ల వైపు ఎట్లా పెట్టాలో వివరించి చెప్పి సత్యాన్ని పంపించాం. సత్యం ఇట్లాంటివి ఒకసారి చెప్తే చాలు పట్టుకోగలడు.

ఆ చల్లని ప్రశాంత వాతావరణంలో — మసక మసక వెన్నెల్లో రాత్రి పిట్టల అరుపుల నేపథ్యంలో ఆ పాట యువహృదయాల కన్నీటి ప్రేమలను ఆలాపిస్తున్నది. దాదాపు యాభై అరవై అడుగుల దూరంలో ఆ ఆదివాసి పడుచువాళ్ల పాట అడవిగొంతువిప్పి పాడుతున్నట్టుగా ఉంది. ఆ భాష తెలీదు. ఆ పాట అర్థం తెలీదు. అయినా, సంగీత ప్రకంపనలతో గుండె పులకించిపోతున్నది. మనసు నిండా అటవీ ఓషధుల సువాసనలు. కొండ శిఖరాలను ముద్దుపెట్టుకుని వెళ్లిపోతున్నగాలుల గలగలనవ్వు. కొండలోయల మధ్య నుంచి కాలంప్రవాహపు కిలకిలలు. నాట్యాలు, స్వప్నాలు, వెన్నెల జల్లులు. చిన్న పిల్లల ఏడుపులాంటి పాట. ఆదిమ మానవుడి నుంచి యుగయుగాల వారసత్వంగా మిగిలిన తేనెపాట.

ఊపిరి బిగపట్టి వింటున్నాం.

చందమామ అస్తమించాడు. పాట ఆగిపోయింది. సత్యం వెళ్లి ఆ టేప్ రికార్డర్ వెనక్కు తెచ్చాడు. దాదాపు ఓ గంటసేపు సాగిందా పాట. మేమంతా ఇంకా

తన్మయత్వంలోనే ఉన్నాం. వాళ్లు నిద్రలోకి ఒరిగిపోయినట్టున్నారు, చుక్కల చూపుల కింద, నేలతల్లి మట్టిచీరల మీద.

టేప్ సరిగ్గానే వచ్చింది. అప్పుడు గొంతు విప్పాడు సత్యం.

పూజారి నూకయ్యగారికి సత్యంగొంతు వినిపించిందేమో నిద్రను చెరిపేసుకుని బయటికి వచ్చి గడపలో కూర్చున్నారు.

ఆ రాత్రి రెండు గంటల వరకు మాకు నిద్ర లేదు. సత్యం పల్లెపాటలని ముద్దుకృష్ణ టేప్ చేస్తున్నాడు. అవి మళ్లీ విన్నాం.

వేకువజామున చిన్న చిన్న చినుకులతో వాన. మేము లేచి చాపలు తీసి టార్చి వెలుతురులో గది లోపలికి చేర్చి పరచుకుని మళ్లీ పడుకున్నాం. ఆ వాన అలాగే కొంతసేపు పడేసరికి పొలం నుంచి సవరలు తమ గంపలతో, కావుళ్లతో వచ్చి పంచకింద చేరారు. ఆ పంచ ఇరుకు. తడుస్తున్నట్టున్నారు. సందడి విని లేచి నూకయ్యగారు వాళ్లను గదిలోపలకు పిలుచుకున్నారు. నిద్రపోవాలను కున్నవాడిని ఆ సందడికి లేచాను. అవతల గదిలో లాంతరు వెలుగులో నులకమంచం మీద కూర్చున్న నూకయ్యగారు గోడకి వాల్చిన ఏకతారతో కనిపించారు. రెండుగదుల మధ్య ఇటుక గోడకి చిన్న గూడు. అట్నించి ఇటు — ఇట్నుంచి అటు చూట్టానికి వీలుగా లాంతరు పెట్టుకోవటానికి వీలయినంత చిన్నది. దాంట్లోంచి చూస్తే కనిపించిన దృశ్యమది. దగ్గరకు వెళ్లి చూస్తే వాళ్లంతా ఆ గదిలో బెరుకు బెరుకుగా నిలుచున్నట్టు కనిపించింది. వాన తగ్గుతుంది, బయటకు పోవచ్చులే అన్నట్టు అంతా నుంచున్నారే తప్ప ఎవ్వరూ కూర్చోలేదు. పూజారిగారి నులకమంచం, ట్రంక్‌లు, ఓ మూల వంట పొయ్యి, వంట గిన్నెలు, ఇతర బుట్టలు, మూటలతో గది సామాన్లతో నిండిపోయి ఇరుగ్గా ఉంది. చూరుకున్న ఇనుపతీగెకి లాంతరు వేలాడుతున్నది.

"వాన తగ్గిన తర్వాత వెళ్లొచ్చు, కూచోండి" అని నూకయ్యగారు వాళ్లను కూర్చోబెట్టారు. సత్యానికి నిద్ర పట్టినట్టు లేదు. లేచి బయటికి వెళ్లి పక్కగదిలోకి దూరాడు.

* * *

ఉదయం మేము నిద్రలేచేసరికి ఎనిమిదిన్నరయింది. బయట ఎండ చురచుర లాడుతున్నది. నూకయ్యగారు స్నానంచేసి నుదుట పొడవాటి కుంకుమబొట్టు పెట్టుకుని, ఎర్రటి పట్టుపంచె కట్టుకుని మందిరం పావంచాల మీద కూర్చుని — బుట్టెడుపూలు ముందేసుకుని దేవి అలంకరణ కోసం నిలువెత్తు మందారాలమాల

కడుతున్నారు.

వేకువ జామున వానకి సవరపిల్లలు నూకయ్యగారి గదికి వచ్చి వాన తగ్గేవరకు కూర్చుని వెళ్లారని చెప్తే విని ముద్దుకృష్ణ చాలా బాధపడ్డాడు. వాళ్లను వాన తమ కాళ్ల దగ్గరకు తెచ్చినప్పుడు తననిద్ర మూలంగా వారిని చూసే అవకాశం పోయిందే అన్నది ఆయన బాధ. తనను లేపవద్దా అంటాడు పదే పదే. సత్యం కోసం వెతికాడు. చీకటి తెల్లవారక ముందే సత్యం ఇంటికి వెళ్లిపోతాడు. ఇంటిపనులు ముగించి మనకోసం వస్తాడన్నాను.

రాత్రి చెప్పినట్టుగా ఎనిమిదిన్నరకల్లా పండా మా కోసం ఉప్మా, కొబ్బరి చెట్నీ, సెనగ పిండితో చేసిన బంగాళదుంప కూర, పూరీలు విడివిడి గిన్నెల్లో పెట్టి, ఆకుల్లో కట్టి ఓ బుట్టతో పంపించాడు. ఆ తెచ్చిన పిల్లవాడు ఆ బుట్టను నూకయ్యగారికిచ్చి వెళ్లిపోయినట్టున్నాడు. నూకయ్యగారా సంగతి చెప్పి 'టీ పెట్టనా' అని అడిగారు. మేము పళ్లు తోముకోవటానికి బ్రష్‌లూ, పేస్టులూ తీసి నూతి దగ్గరకు వెళ్లాం. నూతి దగ్గర "సత్యం ఏడీ" అని మరోసారి అడిగాడు ముద్దుకృష్ణ.

'వాళ్లను చూడాల్సింది. వాళ్ల ఫోటోలు తీసుకోవాల్సింది. ఎంత గొప్ప అవకాశం తప్పిపోయింది' అన్నది శిరోమణి బాధ. నాకా దృష్టి లేదు. పైగా నాకు వాళ్లు నిత్యం కనిపించే మనుషులు.

స్నానాలు ముగించాక దేవీపూజతో ఇవాల్టి మా కార్యక్రమం మొదలు. మధ్యాహ్నం భోజనం చేసి బయటపడి పక్షుల కోనేరు, రాళ్లగుట్ట, నెమళ్లఅడవి చూసిరావాలని. రేపు కొండల్లోకి వెళ్లి సవరగ్రామాలు చూసి, అక్కడ వాళ్ల ఫోటోలు తీసుకుని రావటం. దొరికితే సవర సంగీత వాద్యాలు కొనుక్కోవాలని ముద్దుకృష్ణ ఆలోచన.

పక్షులకోనేరు, రాళ్లగుట్ట, నెమళ్లఅడవి ఆ పూటంతా చూసి, చీకటి పడ్డాక అడవిలో ఎండుకట్టెలు పోగుచేసి మంటచేసి, ఆ మంటచుట్టూ కూర్చుని సత్యంతో పాటలు పాడించుకున్నాం. ఢిల్లీ నుంచి తన మిత్రుల బృందాన్ని పంపించి దీన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించే కార్యక్రమానికి అంకురార్పణగా ఒక మంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ నిర్మించే ఏర్పాట్ల గురించి ముద్దుకృష్ణ తన ఆలోచనలు చెప్పాడు. శిరోమణికి చిలకలచెట్టు ప్రత్యేకమైన ఆకర్షణ అయింది. అక్కడే నాలుగు రీళ్లు ఖర్చు చేశాడు. తన పత్రికలో వర్ణ చిత్రాలతో నెమెళ్ల అడవి మీద వ్యాసం వస్తుందన్నాడు.

అక్కడ మరచిపోలేని అందం పక్షులకోనేరని తీర్మానించాడు కామేశ్వరరావు.

అక్కడో చిన్నగుడిసె వేసుకుని ప్రియురాలిని తెచ్చుకుని, ఈ అడవిలో బతికి పోవచ్చునట.

అందరూ దాన్ని అందాలదీవి అని ఒప్పుకున్నారు. పక్షుల కోనేరు, రాళ్లగుట్ట, చిలకలచెట్టు, నెమళ్లఅడవి పర్యావరణ సౌందర్య సముదాయంగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని, ప్రభుత్వ సహాయం జోలికి పోకుండా స్నేహితులమే దీన్ని అభివృద్ధిపరచాలనీ, ఈ అభివృద్ధి కోసం ఏయే సదుపాయాలు సమకూర్చు కోవాలో నిర్ణయించేందుకు నిపుణులబృందాన్ని సంప్రతించాలని, ఆ మేరకు తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఒకరిద్దరు నిపుణులను ఇక్కడకు తీసుకు రావటానికి శిరోమణి ఉత్సాహం చూపించాడు. విదేశీ పర్యాటకులను ఇక్కడకు తను పంపించగలడట ముద్దుకృష్ణ.

పట్టుదలతో కృషి చేస్తే నాలుగయిదేళ్లలో దీన్ని ఒక పర్యాటక కేంద్రంగా రూపొందించవచ్చునని అందరికీ నమ్మకం కలిగింది. సవరలు చేసుకునే అడవి దేవతపండుగ రోజును ఈ కార్యక్రమాన్ని ఆవిష్కరించే రోజుగా నిర్ణయించు కోవాలనుకున్నాం. చైత్రం నెలదినాల కిందటే వెళ్లిపోయింది. పదకొండు నెలల తర్వాత అన్నీ అనుకూలిస్తే, ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం జరుగు తుందన్న మాట.

రాత్రి ఊరు చేరుకునేసరికి తొమ్మిదయింది. పండా ఇంట్లో భోజనం చేసి మందిరం చేరుకునేసరికి, ఏకతార మీద వీరబ్రహ్మంగారి తత్త్వాలు పాడుకుంటున్న నూకయ్యగారు మా రాక విని బయటికి వచ్చి "మీ ఉత్తరాలు" అని రెండు ఇన్‌లేండ్ ఉత్తరాలు నా చేతిలో పెట్టారు.

ఒకటి డూన్ నుంచి రామారావు రాసింది. కిందటి ఎండాకాలం మా అరకులోయ — పాడేరు యాత్ర గురించి తాను రాసిన వ్యాసం ఇంగ్లీషు దినపత్రికలో వచ్చిందట. ముస్సోరీ వెళ్లి కిందటి నెల రస్కిన్ బాండ్‌ను కలిసి వచ్చాడట. ఈ వేసవిలో తాను తెలుగుదేశం రాబోవటం లేదట. గఢ్వాల్ పర్వతపంక్తుల్లో కాలినడకన తిరిగి రావాలనుకుంటున్న ఒక జట్టుతో తాను వెళ్తున్నాడట.

రెండో ఉత్తరం జాబిల్లిపేట నుంచి శాస్త్రి రాసింది.

సావిత్రమ్మగారు నెలదినాలు చేసిన ప్రయత్నాలు ఫలించటం వల్లనైతేనేమి, ఆ దంపతుల అదృష్టం వల్లనైతేనేమి ముత్యాలు భర్త దగ్గరకు వెళ్లటానికి అంగీకరించిందట. ఆ పిల్లమనసు ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. సావిత్రమ్మగారు

ఏం చెయ్యమంటే అది చేసేట్టుంది. వెంటనే సత్యాన్ని పంపించు అని శాస్త్రి క్లుప్తంగా రాసిన ఈ చిన్న ఉత్తరం శుభవార్తను మోసుకొచ్చింది.

మనసు సంతోషంతో, విజయానందంతో, ఆనందాశ్రువులతో సత్యం చెవిలో ఈ వార్త ఎంత త్వరగా వేద్దామా అని చూస్తున్నది. ఈ సమస్య ఇంత త్వరగా, ఇంత అప్రయత్నంగా, ఇంత సులభంగా పరిష్కారం అవుతుందని నేను ఊహించలేదు. సావిత్రమ్మగారు నెలదినాలు చేసిన ప్రయత్న ఫలితమే కావచ్చు. కానీ, నాకు అప్రయత్నంగా జరిగినట్టే అనిపించసాగింది. సత్యానికి కాలం ఇన్నాళ్లకు కలిసి వచ్చింది. సత్యం ఇప్పుడు వస్తాడు. ఈ రాత్రి మాతోనే ఉంటాడు. ముద్దుకృష్ణ ఈ రాత్రి మరికొన్ని పాటలు టేప్ చేసుకుంటాడు. కానీ సత్యం కూడా రేపు మాతోనే ఉంటాడా? ఈ మాట చెప్తే ఉదయమే జాబిల్లిపేట ప్రయాణం కట్టాడా?

ఏమైనా, ఈ శుభవార్త చెప్తే ఎగిరి గంతులేస్తాడని సత్యం రాకకోసం ఎదురుచూస్తున్నాను.

నిన్నటికన్నా వెన్నెల కొంచెం చిక్కబడింది. నూకయ్యగారు మాకోసం తన నులక మంచాన్ని వాకిట వేయించారు. నా నర్సరావుపేట వాలుకుర్చీ, చాపలు కూడా.

బట్టలు మార్చుకుని పగటి నడక అలసట తీర్చుకోవడానికి అంతా వాకిట్లో చేరాం. కామేశ్వరరావు రాసిన కొత్త నాటకం 'వీడ్కోలు' ప్రదర్శన గురించి ధర్మారావు ముచ్చట్లు చెప్తున్నాడు. ఒక్కొక్క మిత్రుడే ఉద్యోగాలపేరుతో, చదువులపేరుతో ఊరు విడిచి పెట్టేసి వెళ్లిపోతున్నప్పుడు ఊళ్లో మిగిలిపోయిన నిరుద్యోగుల కథ ఆధారంగా రాసిన నాటకం అది.

అంతలో ముద్దుకృష్ణ నన్ను చేత్తో అందుకుని మందిరం వెనుక మందారాల తోట వేపు తీసుకుని వెళ్లాడు.

"సంజీవ్, సత్యాన్ని నేను నాతోపాటు ఢిల్లీ తీసుకుపోవాలని నిర్ణయించుకున్నాను. ప్రపంచం అతని కాళ్లమీద పడేటంతటి మహాగాయకుడు సత్యం. అడవిగాచిన వెన్నెల్లా ఇక్కడ వదిలేయడం నాకు ఇష్టం లేదు. నేను తీసుకుపోవాలనుకుంటున్నాను. అయితే, ఇప్పుడే ఈ సంగతి ఊళ్లో ప్రచారం కావద్దు. మనం, వారం దినాల్లో ఢిల్లీ ప్రయాణం ముందు వచ్చి, అప్పుడు చెప్పుదాం. ఇద్దరికీ రిజర్వేషన్ చేయించేస్తాను. ఈ నిర్ణయం నీ మనసులో ఉంచుకో. నూకయ్యగారితో కూడా చెప్పవద్దు. నాకు సహాయం చెయ్యి."

ముద్దుకృష్ణ సాయంత్రం పక్షులకోనేరులో ధర్మారావు, కామేశ్వరరావు స్నానం

చేస్తున్నప్పుడు, ఒడ్డున గట్టుమీద కూర్చున్నప్పుడు సత్యం కుటుంబ వివరాలు ఎందుకు అడిగాడో, నిద్ర లేచిన వెంటనే ఉదయం నించీ సత్యం పేరు పదే పదే ఎందుకు కలవరిస్తున్నాడో ఇప్పుడర్థమయింది నాకు.

"ఈ నిర్ణయం గురించి మన స్నేహితులతో చెప్పటం కూడా ఇష్టం లేదు నాకు. నువ్వు కూడా ఎవ్వరితో మాటవరసకన్నా అనవద్దు. వెళ్లే ముందురోజు వచ్చి సర్పంచ్ నాయుడు గారితోనూ, వాళ్ల అన్నతోనూ మాట్లాడుదాం. అయితే, అప్పుడు కూడా వాళ్లకు మనం ఈ సంగీతం విషయం చెప్పనక్కర్లేదు. పనివాడిగా తీసుకుపోతున్నట్టు చెప్పటమే మంచిది. సాయంత్రం సత్యంతో అన్నాను— 'నాతో ఢిల్లీ వచ్చేయ్ సత్యం, అని. 'వచ్చేస్తా' అన్నాడు నవ్వులాటగా. నాతో వచ్చేస్తాడు. నా దగ్గరే ఉంటాడు. రెండు మూడేళ్లు వాడు సాధన చెయ్యాల్సి ఉంటుంది. కొందరు జన్మంతా తలకిందులు తపస్సు చేసినా దైవప్రసాదంగా వచ్చే ఆ కళ అబ్బదు. సత్యం రెండు మూడేళ్లలో జాతీయస్థాయి గాయకుడవుతాడు. చదువు అయిదో తరగతే అని నిరుత్సాహం లేదు. ఆ సంగతి నేను చూసుకుంటాను."

ముద్దుకృష్ణ, ఎవరో తెలీని ఓ పల్లెటూరు యువకుని కోసం ఇంత నిండుప్రేమతో, సంగీతం మీది పిచ్చితో, మనసులోని తియ్యటి కోరిక గురించి నాతో చెప్పి, నా సహాయం కావాలని వేడుకుంటుంటే, అది నా విజయమే అనిపించి ఒళ్లు పులకరించింది. నెమళ్ల అడవి అందం నాకు కనిపించిందిగాని, సత్యంగొంతులో ఉన్న అద్భుతం నాతో ఇన్నాళ్లు ఉన్నా నాకు తెలీలేదు, సత్యం నిజమైన వజ్రమని.

సత్యం పెళ్లి, పెళ్లాం ముత్యాలు భర్త కొన్నాళ్లు కాపురం చేసి, తిరిగి కాపురానికి రాకుండా కన్నవారింట ఉండిపోవడం, ఆ సమస్య పరిష్కారానికి నేను చేస్తున్న ప్రయత్నాలు సాయంత్రం ముద్దుకృష్ణకు నేను చెప్పినవే.

ఇప్పుడు శాస్త్రి రాసిన ఉత్తరం గురించి ముద్దుకృష్ణకు చెప్పటమా, నాలోనే ఉంచుకోవటమా?

సత్యంని ఇప్పుడు జాబిల్లిపేట పంపించటమా, మానటమా? ఏదీ తేల్చుకోలేకపోతున్నాను. ఈ ఆలోచనలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఒక పక్క సంతోషం, మరోపక్క ముత్యాలు కనిపించి దుఃఖం.

సత్యాన్ని, నా స్నేహితుడు, అమాయకుడైన సత్యాన్ని, నానుంచి ముద్దుకృష్ణ లాక్కుపోతున్నట్టు కూడా తల్లిపేగు లాంటి బాధ. నా నెమళ్ల అడవినే ముద్దుకృష్ణ దోచుకుంటున్నట్టు బాధ. సత్యం నన్ను విడిచిపెట్టి వెళ్లిపోతే నెమళ్ల అడవి, పక్షుల

కోనేరు, చిలకలచెట్టు, రాళ్లగుట్ట ఏమవుతాయి? రోదించవా? ఆ లోటు తీర్చే వేరొకరు నాకు దొరుకుతారా?

ఈ లోపు సత్యం పెళ్లాం ముత్యాలు వచ్చేస్తేనో!

'రాకూడదు' అనుకున్నాను నిశ్చయంగా. సత్యాన్ని కళాదేవతకు కానుకగా దేశానికి సమర్పించడంలో ఉన్న గర్వం, సంతోషం నన్ను ఓదార్చాయి.

* * *

*సాహిత్య వార్షిక సంచిక 95*

*ఇండియాటుడే*